అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం 23 ఫిబ్రవరి 2023

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన సుధనవేణి రాజ్ కుమార్ గౌడ్ ఇటీవల తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. విషయాన్ని తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్ రెడ్డి బాధిత కుటుంబాన్ని బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. పేద కుటుంబం కావడంతో ఆర్థిక సహాయం కింద 5 వేల రూపాయలు అందజేశారు. సునీల్ యువసేన సభ్యులు బెజ్జారం భాను, కల్లెడ పురుషోత్తం ఆర్థికసాయం అందజేశారు.

కుటుంబరావు కన్నుమూత





నవతెలంగాణ-నిజామాబాద్

సీపీఐ(ఎం) సీనియర్ సభ్యులు పరుచూరి కుటుంబరావు బుధవారం సాయంత్రం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన పార్థివ దేహానికి సీపీఐ(ఎం) నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. నేడు ఉదయం 10 గంటలకు మాధవ్‌నగర్‌లోని ఆయన ఇంటి నుంచి మెడికల్ కాలేజీకి వరకు అంతిమయాత్ర చేపట్టి మెడికల్ కాలేజీకి పార్థివదేహాన్ని అందజేయనున్నారు. ఆయన మృతి పట్ల సీపీఐ(ఎం) తీవ్ర సంతాపం ప్రకటించింది.

పంచాయతీలకు నిధుల విడుదల

రెండు విడతలోనే సరి

- సర్పంచుల ఆశలపై కేంద్రం నీళ్లు
- కొత్త సాఫ్ట్‌వేర్ పేరిట జాప్యం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేసినట్టే చేసి.. మళ్లీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపివేశాయి. కేవలం రెండు విడతల్లోనే నిధులు పంపారు. పంపిన నిధులు సైతం అరకొర ఉండటంతో సర్పంచులు తలలుపట్టుకుంటు న్నారు. పంచాయతీ నిధుల విడుదల జాప్యంలో కొత్త సాఫ్ట్‌వేర్ కారణమని గతంలో పంచాయతీ అధికారులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ పరిశీలన పూర్తయితే నిధుల విడుదలలో ఆలస్యం ఉండబోదని, పెండింగ్ నిధులు సైతం వస్తాయని అన్నారు. కేంద్రం సైతం రెండు విడతలుగా నిధులు విడుదల చేసింది. కానీ మళ్లీ నిధుల విడుదలను ఆపేసింది.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 530 పంచాయతీలు ఉన్న విషయం తెలిసిందే. ఈ యేడాది మార్చి-ఏప్రిల్ నుంచి కేంద్రం నిధులు ఆపేసింది. అయితే ఇటీవల రెండు విడతల్లో కలిపి రూ.29 కోట్లు విడుదల చేసింది. కాగా పంచాయతీ నిధుల విడుదలకు సంబంధించి కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకొస్తున్నందున విడుదలలో జాప్యం జరిగిందని పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్ ప్రకారం.. పంచాయతీకి ఖర్చు అయిన నిధులను కేంద్రం నేరుగా.. సంబంధిత యజమానులకు పంపేలా ప్లాన్ చేసింది. ఉదాహరణకు పంచాయతీలకు అవసరమైన ఎల్‌ఈడీ లైట్లు కొనుగోలు చేస్తే.. ఆ బిల్లును వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

ఆ బిల్లు పరిశీలన పూర్తయ్యాక నేరుగా కేంద్రం ఖాతా నుంచి సదరు యజమాని ఖాతాకు నగదు బదిలీ అవుతుంది. దీనివల్ల నిధుల్లో పారదర్శకత ఉంటుందని కేంద్రం భావిస్తోంది. ఈ మేరకు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేర్పులు చేశారు. ఇటీవల ఈ సాఫ్ట్‌వేర్ పూర్తయ్యాక.. పరిశీలన కోసం రెండు విడతలుగా కేంద్రం నిధులు విడుదల చేసింది. ఇకపై నిధుల విడుదలలో ఆలస్యం జరగబోదని పంచాయతీ అధికారులు భావించారు. కానీ నిధుల విడుదల మళ్లీ మొదటికి వచ్చింది. రెండు విడతలు మినహా మళ్లీ నిధుల విడుదల జరగడం లేదు. పెండింగ్ నిధులు విడుదల అవ్వక.. పంచాయతీల్లోని సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. పంచాయతీలకు ఖర్చు అయిన నిధుల బిల్లులు మంజూరు కావడం లేదు.

వెంచర్ కోసం మొరం తవ్వకాలు

- మొరం టిప్పర్లను అడ్డుకున్న నాగపూర్ గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని నాగపూర్ గ్రామ సమీపంలో గల వరద కాలువ కట్ట నుండి అక్రమంగా మొరం తవ్వకాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రం శివారులో వెలుతున్న వెంచర్ల కోసం కట్టనుండి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా మొరం తరలిస్తున్న పట్టించుకునే వారే లేకుండా పోయారు. బుధవారం వరద కాలువ కట్ట నుండి పెద్ద ఎత్తున అక్రమంగా మొరం తరలింపును గమనించిన నాగపూర్ గ్రామస్తులు జెసిబితో మొరం తవ్వకాలను, మొరం తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. నాగపూర్ గ్రామంలో భారీ వర్షాల మూలంగా పలు రోడ్లు గుంతల మయమై ప్రజలు నడవలేని పరిస్థితులు ఏర్పడితే గుంతలు నింపేందుకు ట్రాక్టర్ మొరం కూడా తీయకుండా ఎస్సారెస్పీ అధికారులు అడ్డుకున్నారని, ప్రస్తుతం వెంచర్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాత్రం టిప్పర్లతో యదేచ్ఛగా అక్రమంగా మొరం తరలిస్తున్న పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అయితే తాము మాత్రం అనుమతులు తీసుకొని వరం తరలిస్తున్నట్లు ఈ సందర్భంగా వెంచర్ యజమాని గ్రామస్తులకు తెలిపారు. తమకు అనుమతి పత్రాలు చూపించాలని గ్రామస్తులు నిలదీయడంతో, రేపు తీసుకువచ్చి చూపిస్తానని చెప్పి యజమాని టిప్పర్లను తీసుకొని వెళ్ళిపోయారు. వరదలకు దెబ్బ తిన్న రోడ్ల మరమ్మతులకు మొరం తరలిచేందుకు మోక్షం లేదు గాని, వెంచర్‌లకు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

వైద్య బృందానికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కంటి శిబిరం ముగింపు కార్యక్రమం నర్సాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ ప్రభాకర్ కంటి వెలుగు వైద్య బృందానికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వివేక్, ఉప సర్పంచ్ పోతుగంటి స్వామి, ఎంపీటీసీ బుసాపురం సుప్రియ, ఏఎన్ఎం అమృత, ఆశ కార్యకర్త శాంతి, డి ఎల్ రాము, పంచాయతీ కార్యదర్శి జులేఖ, కారోబార్ రమేష్, అంగన్వాడి టీచర్లు, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, కంటి వెలుగు మెడికల్ క్యాంపు బృందం సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం వెలుగుజూసింది. ఎస్సై ఆనంద్ గౌడ్ వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సూరజ్ కుమార్ (20) మండల కేంద్ర శివారులో స్థానిక ఎంఎస్ఎన్ రసాయన కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. బీహార్ రాష్ట్రంలో తన స్వగ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. దీనికి యువతి తల్లిదండ్రులు అడ్డు చెప్పడంతో సూరజ్ కుమార్ తాను ప్రేమించిన అమ్మాయి తనకు దక్కదని మనస్థాపంతో యువతికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలాన్ని ఎస్సై ఆనంద్‌గౌడ్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డిఏరియా ఆస్పత్రికి తరలించారు.

బాల్యవివాహం అడ్డగింత

- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-రెంజల్



మండల కేంద్రమైన రెంజల్ శివాలయం సమీపంలో 16 సంవత్సరాల బాలికకు వివాహం చేయడానికి తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తుండగా.. సమాచారం అందుకున్న బాలల సంరక్షణ విభాగం అధికారులు అడ్డుకున్నారు. బుధవారం వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 సంవత్సరాల వరకు వివాహం చేయరాదని, మరో రెండు సంవత్సరాలు ఓపిక పట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం అధికారులు ఎస్కే జమ్రుత్, నాగేల్లిబాబు, కోఆర్డినేటర్ జ్యోత్స్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అక్రమాలను ఉపేక్షించొద్దు

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు. బుధవారం ఆయన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ సంచాలకులు హనుమంతరావుతో కలిసి ఉపాధి హామీ సామాజిక తనిఖీ అంశంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సోషల్ ఆడిట్‌లో నిధులు దుర్వినియోగం జరిగినట్లు వెల్లడైన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడిన వారిని ఎంతమాత్రం ఉపేక్షించకూడదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పలు జిల్లాలలో పనులు చేయకుండానే తప్పుడు రికార్డులు సృష్టించి నిధుల అవకతవకలకు పాల్పడడం, మొక్కల సంరక్షణ చర్యల పేరుతో నిధులను స్వాహా చేయడం వంటి ఉదంతాలను ఈ సందర్భంగా ఉటంకించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణ అయితే నిధుల రికవరీ, నోటీసుల జారీ వంటి వాటితోనే సరిపెట్టుకోకుండా, అక్రమాల తీవ్రతను బట్టి బాధ్యులైన వారిని అవసరమైతే విధుల నుండి తొలగించాలని సూచించారు. హెచ్చరికలు, నామమాత్రపు పెనాల్టీలతో అక్రమాలకు అడ్డుకట్ట పడదని, నిధులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయనే సంకేతాలు స్పష్టంగా వెళ్లాలన్నారు. అప్పుడే అవకతవకలను అరికట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. పని చేయకుండానే తప్పుడు రికార్డులు సృష్టించి నిధులను వాడుకోవడం నేరపూరిత చర్యగా పరిగణించాలన్నారు. వెచ్చించిన నిధుల విలువకు సరిపడా పనులు జరిగాయా, లేదా అన్నది ఫోటోగ్రాఫ్స్, ఇతర స్పష్టమైన ఆధారాలతో పరిశీలించాలని సూచించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, సామాజిక తనిఖీ నివేదికల ఆధారంగా బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఆర్‌డీఓ చందర్, ఏపీడీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పన్నులు చెల్లించాలి

నవతెలంగాణ-బోధన్

వాహనదారులు ప్రభుత్వానికి చెల్లించవలసిన ఫిట్ నెస్, పర్మిట్ లాంటి పన్నులను తక్షణమే చెల్లించి సహకరించాలని సాలూర మండల చెక్ పోస్ట్ ఎంవీఐ పండరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు వాహనాలకు సంబంధించిన పన్నులను చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిన వారిపై రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు భారీ జరిమానాలు విధిస్తున్నట్టు తెలిపారు. వాహనదారుల నుంచి పెండింగ్ బిల్లుల వసూలుకై ప్రభుత్వం ఆర్టీఏ అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. పెండింగ్ బిల్లులు కలిగి ఉన్న వాహనదారులు ఈ తనిఖీ బృందాలకు పట్టుబడితే 200 శాతం జరిమానా విధించి కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు. కావున వాహనదారులు స్వచ్ఛందంగా మీ సేవలో పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. అలాగే ప్రతి వాహనానికి సరయిన పత్రాలు, ఇన్సురెన్స్ కలిగి ఉండాలని సూచించారు. 31 తేదీ వరకు ప్రత్యేక తనిఖీ బృందాలు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

పేదల కోసం ఫార్మసీ అభినందనీయం

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి
- మల్లుస్వరాజ్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో జి. సరోజనమ్మ ఫార్మసీ ప్రారంభం

వివరాలు మెయిన్‌లో..



జనరిక్ ఫార్మసీని ప్రారంభిస్తున్న సివిల్ జడ్జి పద్మావతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పేదల కోసం ఫార్మసీ ప్రారంభించడం అభినందనీయమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ అసోసియేషన్, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని హమాల్‌వాడీలోని ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన సరోజినమ్మ జనరిక్ ఫార్మసీని బుధవారం జడ్జి ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి అధ్యక్షతన నిర్వహించిన సభలో సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పేదలకు అతి తక్కువ ధరలతో నాణ్యత కలిగిన మందులు అందించడం అమోఘమని అన్నారు. పేదలంతా ఇలాంటి సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల కోసం నిస్వార్థంగా సేవలు చేస్తున్న మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం చేసిన పోరాటాలు అందరికి ఆదర్శం అని గుర్తు చేశారు.

నందివాడలో ఏసీబీ సోదాలు

నవతెలంగాణ-తాడ్వాయి



సోదాలు చేపట్టిన అధికారులు

తాడ్వాయి మండలం నందివాడ గ్రామంలో మంగళవారం రాత్రి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నందివాడ గ్రామానికి చెందిన కందడి వేణు రెడ్డి మెదక్ జిల్లా కౌడిపల్లి మండల తహసిల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భూమి రిజిస్ట్రేషన్ విషయంలో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆపరేటర్ వేణు రెడ్డి స్నేహితుడైన కేతావత్ రాజుకు డబ్బులు ఇవ్వాల్సిందిగా వేణు రెడ్డి రైతు నీరుడి పోచయ్యకు సూచించారు. యధావిధిగా పోచయ్య రాజుకు డబ్బులు అందించాడు. వెంటనే రాజు వేణు రెడ్డికి రూ. 20 వేలు అందిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో 10 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం తాసిల్దార్ కార్యాలయంలో ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న వేణు రెడ్డిని రైతు పోచయ్య సంప్రదించాడు. రూ.20 వేలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని వేణురెడ్డి రైతుకు తెలిపాడు. దీంతో రైతు పోచయ్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు. అధికారుల సూచన మేరకు మంగళవారం డబ్బులు అందించారు. డబ్బులు అందిస్తున్న సమయంలోనే వేణు రెడ్డిని పట్టుకున్నారు. అనంతరం వేణురెడ్డి స్వగ్రామమైన తాడ్వాయి మండలం నందివాడ గ్రామానికి వచ్చి రాత్రి 11:30 గంటల వరకు వేణు రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... సోదాలు పూర్తిస్థాయిలో నిర్వహిస్తు న్నామని వివరాలు పై అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



కండక్టర్ చార్ట్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం

నవతెలంగాణ-నిజాంసాగర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు రీజినల్ మేనేజర్ ఉషాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు పనులు పూర్తి కావడంతో పరిశీలించారు. అనంతరం బస్టాండ్‌లో గల మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, కుర్చీలు, లైట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లాలో గల బస్టాండ్లను మరమత్తు పనులు చేపట్టి ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-ధర్పల్లి

మద్యంతాగి వాహనం నడిపిన వ్యక్తికి స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖాదిరి ఏడురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వంశీ కృష్ణ రెడ్డి బుధవారం తెలిపారు. మూడు రోజుల క్రితం వాహనాలు తనిఖీలు చేస్తుండగా మాలావత్ లక్ష్మణ్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా కేసు చేశామని తెలిపారు. బుధవారం ఆయన్ను కోర్టుకు హాజరు పరుచగా మేజిస్ట్రేట్ ఏడు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు

ఊరివారే.. ఉసి గొల్పారు?

- ఊరి తగాదాలతో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం
- ప్రయివేటులో మృత్యువుతో పోరాటం
- రోడ్డున పడ్డ కుటుంబం
- ఇంత జరుగుతున్నా పట్టింపులేని అధికారులు

నవతెలంగాణ-నంది పేట్





చికిత్స పొందుతున్న బాధితుడు

వీడీసీలో క్యాషియర్ పోస్టు కోసం రెండు వర్గాల మధ్య రగలిన తగాదా.. చినికి చినికి గాలివానలా ఊరిని రెండుగా చీల్చింది. ఇంతటితో ఆగకుండా ఇప్పుడు ప్రాణాల మీదుకు తీసుకోస్తుంది. ఎవరి పని వారు చేసుకుంటున్న సందర్భంలో కొందరు మరింత చిచ్చు పెడుతూ గ్రామంలో విబేధాలు తీసుకోస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో ప్రతి క్షణం రెండు వర్గాల మధ్య అగ్గి రాజిల్లుతోంది. ఓ కుటుంబానికి ఆ పంచాయితీ చేరేసరికి తండ్రి, కొడుకుల మధ్య గొడవకు దారి తీసింది. ఆ గొడవతో మనస్తాపం చెందిన కొడుకు చివరకు గడ్డిమందు తాగి ప్రాణాలమీదకు తెచ్చుకున్నాడు.

నందిపేట్ మండలం వెల్మల్‌లో గ్రామంలో కొన్ని రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్న విషయం విధితమే. పొట్ట చేతపట్టుకొని ఉదయం గొర్లను, మేకలను మేపడనికి అడవుల వెంట వెళ్లేవారు నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో అనేక మంది ఉన్నారు. వీరిలో సగానికి సగం అక్షరాస్యత సరిగా లేనివారు చాలా మంది ఉన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా రోజంతా కుటుంబీకులకు దూరంగా ఉంటూ బతుకులు వెళ్లదీస్తున్నారు. దీనిని ఆసరా చేసుకుని ఓ వర్గం వారు గ్రామానికి చెందిన కుర్మె పెద్ద సాయన్న కొడుకు సదానంద్‌ను ప్రతి రోజు ఏదో ఒకటి చెపుతూ గ్రామాభివద్ధి కమిటీలో మీ నాన్న అడ్డు వస్తున్నారని మీ నాన్నకు చెప్పరాదని హెచ్చరిస్తూ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మద్యం తాగించి తండ్రిపై కక్ష పెంచినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వారి చెప్పుడు మాటలతో మద్యం మత్తులో తండ్రితో గొడవపడి చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. కాలనీ ప్రజలు ఇరువురినీ సముదాయించారు. ఐతే తన తండ్రి నా మాటలు వినడం లేదని మనస్తాపానికి గురైన సదానంద్.. ఆవేదనకు గురై ఖుద్వాన్ పూర్ ఎల్లమ్మ గుడి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం సదానంద్ జిల్లాలో ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చావుతో పోరాడుతున్నడు. అతని పరిస్థితి చూసి తండ్రి సాయన్న, సదనంద్ భార్య ఇద్దరు కుమారులతో ఆసుపత్రిలో బిక్కుబిక్కు మంటూ ఏడుస్తు వారి బాధను వెళ్లబోసుకుంటున్నారు.

కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు జిల్లా జడ్జితో కలిసి ఆస్పత్రిలో బాధితుడి నుంచి వాగ్మూలం రికార్డు చేయించినట్టు పోలీసులు తెలిపారు. తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఇప్పటికి జోక్యం చేసుకొని అధికార యంత్రాంగం

మండల కేంద్రంలో మేజర్ గ్రామ పంచాయతీలలో వెల్మల్ గ్రామం ఒకటి. గత కొంతకాలంగా రెండు వర్గాల ప్రజలు మధ్య గొడవలు జరిగిన ఊరిని రెండుగా పంచుకున్నారు. లోలోపల మాటలతో కుమ్ములాడు కుంటున్నా అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లుగా వ్యవహారిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వర్గాల కుల పెద్దలు వీడిసి క్యాషియర్ పదవి కోసం ఊరిని రెండుగా చీల్చి కలిసి మెలసి ఉన్న ప్రజల్లో విబేధాలు రావడంతో ఆందోళన చెందుతూ సామాన్య ప్రజలు ఆత్మహత్యయత్నాలకు పాల్పడుతూ కుటుంబంలో తీరని క్షోభను తెచ్చిపెడుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, పాలకులు స్పందించి రెండు వర్గాలను కూర్చొబెట్టి మాట్లాడి సమస్యను సద్దుమణిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అన్యాయంగా ఖాళీ చేపించింద్రు



గత కొన్ని నెలలుగా ఓ వర్గం వారి ఇండ్లల్లో అద్దెకు ఉపాధి కోసం చికెన్ షాపు పెట్టుకున్నా. గ్రామంలో అనుకోని రీతిగా వీడిసి క్యాషియర్ పదవీ కోసం లోల్లి నడుస్తోంది. దీంతో వారి ఇళ్లలో ఉండే చికెన్ సెంటర్ షాపుని ఖాళీ చేయించారు. వేరే వారితో చికెన్ అమ్మిస్తుంద్రు. నేను రోడ్డు మీద చికెన్ అమ్ముకోవాల్సి వస్తుంది. మా ఊరి సర్పంచ్ భర్త తన తమ్ముడి కూతురి పెళ్లికి బయట నుంచి మేకలను కొనుగోలు చేసి సపరేటు వారితో మేకలను కోపించారు. మేము ఓటు వేయలేదా? మా ఊరి సర్పంచ్ కదా? అసలే పేదరికంలో ఉన్నాం. నా కుటుంబం ఎట్లా నడవాలే. నా చికెన్ షాపు నాకు ఇప్పించాలని వేడుకుంటున్నా. వీడిసి వ్యవస్థను రద్దు చేయాలి. **-కటికె దర్శన్.**

మా దృష్టికి రాలేవు

ఆర్డీవో శ్రీనివాసులు



వెల్మల్ గ్రామంలో జరుగుతున్న పరిణామాలు నా దష్టికి రాలేవు. చట్టవ్యతిరేకమైన చర్యలకు ఎవరు పాల్పడిన తగిన చర్యలు తీసుకుంటాం. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు రూపంలో మా దష్టికి తేవాలని చెప్పారు. రెండు వర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
గురువారం 23 ఫిబ్రవరి 2023

చిన్నారులకు టీకాలు తప్పకుండా వేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి బుధవారం ఆలూరు ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారి అశోక్ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలను గర్భిణీ స్త్రీలకు ఇచ్చే టీకాలను క్రమం తప్పకుండా వేయాలని అందించాలని సూచించారు. ఆరోగ్య ఉప కేంద్రం రికార్డులను పరిశీలించారు.కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. 18 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకునే విధంగా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సుభాష్, ఆరోగ్య కార్యకర్త గిరిజ, ముప్పారం నరేష్, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నగరంలో సినీనటి నభా నటేష్ సందడి

- ముగ్ధ వస్త్ర ప్రపంచం ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



నిజామాబాద్ నగరంలో ముగ్ధ వస్త్రాల సముదాయాన్ని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, నగర మేయర్ దండు నీతి కిరణ్, కార్పొరేటర్ బైకన్ సుధా మదుతో కలిసి బుధవారం ప్రారంభించారు. కంచి పట్టు చీరలు, స్త్రీలకు ఒకే చోట అనేక రకాల రంగులు, డిజైన్లతో వస్త్ర ప్రపంచాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ప్రత్యేక అతిథిగా సినీ నటి నభా నటేష్ వస్త్ర వ్యాపార సముదాయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నటి నభానటేష్ సందడి చేశారు.

తరచూ ట్రాఫిక్ జాం

- మాధవ్‌నగర్ రైల్వే బ్రిడ్జి, బైపాస్ వద్ద నిలుస్తున్న వాహనాలు
- ఏక కాలంలో బ్రిడ్జి, బైపాస్ రోడ్డు విస్తరణ పనులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మాధవనగర్ రైల్వే బ్రిడ్జి దగ్గర మరమ్మతులు జరుగుతున్నాయి. అక్కడ హెవీ లోడ్ లారీ దిగబడిపోవడంతో గంటకు పైగా అన్ని వాహనాల వారు ఇబ్బందులకు గురయ్యారు. చివరకు పోలీసులు వచ్చి క్లియర్ చేసేసరికి గంటకు పైగా సమయం పట్టింది. రైల్వే బ్రిడ్జి దగ్గర మరమ్మతులు జరుగుతున్న సందర్భంగా వాహనదారులు ఎక్కువగా బైపాస్ రోడ్డుని ఉపయోగించు కుంటున్నారు. అలాగే పూర్తిగా మాధవ్ నగర్ రైల్వే గేటును త్వరలో మూసివేయనున్నారు. దాని సందర్భంగా ఈ బైపాస్ రోడ్‌లో ప్రతినిత్యం చాలా రద్దీగా ఉంటుంది. ఈ బైపాస్ రోడ్‌లో ఉన్న డివైడర్ పనులు నాలుగు రోడ్ల పని కూడా మరమ్మతులు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మాధవ నగర్ రైల్వే బ్రిడ్జి పనులు మొదలు పెట్టక ముందు ఈ బైపాస్ రోడ్డు మరమ్మతులు, నాలుగు రోడ్ల డివైడ్ పనులు పూర్తి అయితే బాగుండు అని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. రెండు ఒకేసారి మరమ్మతులు జరగడం వల్ల ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పట్టణ అధికారుల అవగాహన లోపం వల్ల ఇటువంటి ఇబ్బందులు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అయినప్పటికీ మాధవనగర్ రైల్వే బ్రిడ్జి మరమ్మతు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని అంటున్నారు. రైల్వే గేటు మూసివేస్తామని ఫ్లెక్సీ కూడ ఏర్పాటుచేశారు. ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలగకుండా అవకాశం కల్పిస్తున్నామని, మరమ్మతు పనులు ట్రాక్ వెనుక భాగాల జరిగాయి కాబట్టి సాధ్యమైనంత వరకు ఈ దారిని అందుబాటులో ఉంచామని, త్వరలో ట్రాక్ ముందు భాగాన పనులు చేపడతామని నిజామాబాద్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ చారి తెలిపారు.



కొనసాగుతున్న పనులు

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన గడ్డం శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో శ్రీనివాసరెడ్డిని ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తానని, రాబోవు కాలంలో రాష్ట్ర సంఘం బలోపేతం కోసం పూర్తి సహకారాన్ని అందించడంతోపాటు అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యులు రవీందర్, భోజాగౌడ్‌తోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ రెడ్డిని అభినందనలతో ముంచెత్తారు.

అనుమతులు లేని అక్షర ది ప్లాంట్ స్కూల్‌ను సీజ్ చేయాలి

- ఏఐపిఎస్‌యూ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అనుమతులు లేకుండా నడుస్తున్న అక్షర ప్లాంట్ కార్పొరేట్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఏఐపీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలోని సెయింట్ థెరీసా పాఠశాలలో అక్షర ప్లాంట్ అనే హైదరాబాద్‌కు చెందిన కార్పొరేట్ పాఠశాల అనుమతులు లేకుండా అడ్మిషన్లకు పాల్పడుతుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) జిల్లా కమిటీ ఆశ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం (ఎంఈఓ) ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల మాట్లాడుతూ.. సెయింట్ థెరిసా పాఠశాల యాజమాన్యం గతంలో నారాయణ పాఠశాలను కొనసాగిస్తే దానిపై ఆందోళన చేయడంతో గుర్తింపును రద్దు చేసిందన్నారు. మళ్లీ సెయింట్ థెరీసా యాజమాన్యం ఆర్జెడి నుంచి అనుమతులు తెచ్చుకొని 2023-24 విద్యా సంవత్సరానికి ఓపెనింగ్ పర్మిషన్లు ఇస్తే హైదరాబాద్ చెందిన అక్షర ది ప్లాంట్ స్కూలుకు పాఠశాలలో కొనసాగిస్తూ అడ్మిషన్లకు పాల్పడుతున్నారని అన్నారు. దీనిపై చర్యలు తీసుకొని సెయింత్ థెరిసా గుర్తింపును రద్దు చేయాలని , మళ్లీ ఆ పాఠశాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. లేకుంటే మరిన్ని ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రిత్విక్, అనిల్, నాగరాజు, మహేష్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బిగాలను సన్మానించిన ఆర్‌పీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్ క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే గణేష్ బిగాల ని బుధవారం కలిసి సన్మానించారు. (ఆర్‌పి)ల సమస్యలపై బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందున ఆర్‌పీలు కృతజ్ఞతలు తెలిపారు.

ఏటీఓ రాములుకు సన్మానం



ఏటీవోను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఉత్తమ సేవలు అందించినందుకు గాను పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏ టీ ఓ రాములును ఆర్డీవో శ్రీనివాసులు మంగళవారం రాత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ వేణుగోపాల్ గౌడ్, టీఎస్ఆర్‌టీసీ డిపో మేనేజర్ కవిత, పట్టణ ఆస్పత్రి సూపరింటెండెట్ నాగరాజు, మండల విద్యాధికారి రాజా గంగారాం తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్.వి హనుమంత్ రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ విజయ సారథి, కోశాధికారి పట్వారి తులసి, మంచిర్యాల సురేష్ కుమార్, కాంతి గంగారెడ్డి, శాల ప్రసాద్, విద్య గోపి, తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణా మందులు వేయించాలి



నట్టల నివారణ మందులు వేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పాడి రైతులు తమ గొర్రెలకు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని సర్పంచ్ సునావత్ లస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని ఇనాయత్ నగర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ లస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ రావు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం వినియోగించుకోవాలని కోరారు. ప్రతి గొర్రె, మేకకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. నట్టల వల్ల మేత సరిగా తీసుకోకపోవడంతో గొర్రెలు, మేకల్లో ఎదుగుదల లోపిస్తుందని, దీనివల్ల నష్టం వస్తుందని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న మట్టల నివారణ శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్, పశు వైద్య సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ ప్రవీణ్ రెడ్డి, ఓఎస్ జమీల్, హెచ్‌ఏ స్వప్న, గోపాలమిత్ర స్వరన్, గొర్రెల మేకల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేటా.. టీఎన్జీవోఎస్ ఆఫీసా..



కలెక్టరేట్‌వద్ద ఏర్పాటుచేసిన టీఎన్‌జీవోఎస్ జెండాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇది జిల్లా కలెక్టరేట్ కార్యాలయమా... లేక ఇది ఉద్యోగుల యూనియన్ కార్యాలయమా.. అని అక్కడ పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, కలెక్టరేట్ కార్యానికి వచ్చే ప్రజలు, రాజకీయ నాయకులు అంటున్న మాట. అవును అనే చెప్పవచ్చు. అది ఎలా అంటే ప్రభుత్వ కార్యాలయంలో టీఎన్జీవోఎస్ యూనియన్‌కు సంబంధించిన జెండాలను ఏర్పాటు చేశారు. దీంతో కార్యాలయానికి వచ్చే అధికారులు, సిబ్బంది, ప్రజలకు ఈ స్థలమంతా యూనియన్ కేటాయించారా.. అనే సందేహం వస్తోంది. కలెక్టరేట్ కార్యాలయం నిర్మించే ముందు ప్రజలకు ఉపయోగపడే విధంగా, ప్రభుత్వానికి అవసరమగు కార్యక్రమాలు నిర్వహించేందుకు హెలిపాడ్‌ను, గ్రీనరీని ఏర్పాటు చేశారు. టీఎన్జీవో యూనియన్ సభ్యులు ఇక్కడ జెండాలను పాతడం ఎంతవరకు సమంజసమో వారికే తెలియాలి.

కంటివెలుగుశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- నడిపల్లిలో శిబిరం ప్రారంభించిన సర్పంచ్ సతీష్‌కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కంటి వెలుగు కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని నడిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కులచారి సతీష్ కుమార్ అన్నారు. బుధవారం డిచ్‌పల్లి బస్టాండ్‌కు ఆనుకుని ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి శిబిరాన్ని ఇన్చార్జి ఎంపిఓ, గ్రేడ్-1 కార్యదర్శి కిషన్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందల్ వాయి ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని మండల కేంద్రంలోని నడ్‌పల్లి గ్రామపంచాయతీలో నెలకొల్పిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి శిబిరానికి రప్పించేందుకు కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు సర్పంచ్ కులచారి సతీష్ కుమార్ కంటి పరీక్షలను చేయించు కున్నారు. మోతే బిందు శస్త్ర చికిత్సకోసం జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు ఎస్ మానస, పిహెచ్ ఎన్ ఎలిజబెత్, ఐకేపీ సీసీలు, ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

విజయ్‌లో ట్విన్స్‌డే



నిజామాబాద్‌నగరంలోని విజయ్‌స్కూల్లో



ఆర్మూర్‌లో..

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలోని విజయ్ హైస్కూల్లో వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైమరీనుండి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న 21మంది కవలలకు తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఒకే వేదికపై ఇరవై ఒక్క జంట కవలలు కలుసు కోవడం హర్షించదగిన విషయమని అన్నారు. ప్రతీ యేడు పాఠశాలలో ఘనంగా కవలల దినోత్సవాన్ని నిర్వహిస్తామని కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి డా. అమృతలత, కరస్పాండెంట్ ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపల్ విజేత పాల్గొన్నారు.

ఆర్మూర్:పట్టణంలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్లో బుధవారం కవలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కవలలుగా ఉన్న విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీ కవిత దివాకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న వ్యక్తి కేసీఆర్

- జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రాన్ని అన్నివిధాలా కంటికి రెప్పల కాపాడుతున్నది కేసిర్‌అని ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. మంగళవారం అయన మండలంలోని మద్దుల్ తండా, వాడి, హొన్నజీపేట్ గ్రామాల్లో 50 లక్షల నిధులతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. వాడి గ్రామంలో 20 లక్షలతో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజతో పాటు 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు ప్రారంభించారు. తాగు నీటి ట్యాంకు మరమ్మత్తులకు జెడ్పిటిసి నిధులు లక్ష రూపాయలు అందిస్తానని హామీనిచ్చారు. మద్దుల తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు, 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. హొన్నాజిపేట్ గ్రామంలోని ఏడు కాలనీల్లో 35 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. సీతాయిపేట్ గ్రామంలో 5 లక్షలతో సీసీ రోడ్డుకు ప్రారంభించారు , ఈసందర్భంగా అయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధికి నోచుకుందంటే అందుకు సీఎం కేసీఆర్ కారణమని అన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక దృష్టితో గ్రామాల్లో తారు, సీసీరోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, తాగు, సాగు నీటికి లోటులేకుండా చేయడం జరిగిందన్నారు. అవసరం ఉన్నచోట్ల చెక్ డ్యామ్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. అనుభవజ్ఞులైన వైద్య సిబ్బందితో కంటి వైద్యం చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు మైపాల్ యాదవ్, సర్పంచులు దేవేందర్ చౌహన్, రొండ్ల బాగవ్వ భగవంత్ రెడ్డి, లోక్కిడి విజయ రాములు, హొన్నాజీపేట్ సొసైటీ చైర్మెన్ రాజేందర్ రెడ్డి, నాయకులు కిషోర్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, గోపాల్ నాయక్, రొండ్ల గంగారెడ్డి, కొండా శేఖర్, ఎంపీటీసీ సరిత, తంగెళ్ల రాజన్న, మోహన్, చేగంటి భూమయ్య, కాటం నర్సయ్య, శివరాం, లచ్చిరాం, అరవింద్, దేశ్య న్యాక్, లలిత, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేసిన బాజిరెడ్డి జగన్‌మోహన్

శ్రీనగర్ గ్రామాన్ని సందర్శించిన పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్



మాట్లాడతున్న డిప్యూటీ కమిషనర్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ పీజే. వెస్లీ నిజామాబాద్ మండలంలోని శ్రీనగర్ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్, శ్మశానవాటిక ఎన్‌పీఏ అవార్డుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లేష్, సర్పంచ్ సురేందర్ రెడ్డిని అభినందించారు. డీపీవో జయసుధ, డీఎల్‌పీఓ నాగరాజ్, ఎంపీవో మధురిమ, సర్పంచ్ సురేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జడ్పీటిసీకి బాజిరెడ్డి జగన్ పరామర్శ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ మండల జడ్పిటిసి బొల్లంక సుమలత గోపాల్ రెడ్డి తండ్రి మృతిచెందడంతో ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట మండల ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ నాయక్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, పార్టీ అధ్యక్షులు మీసాల మధుకర్, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీధర్, జితేందర్, గుండారం ఎంపీటీసీ అంకల గంగాధర్, సర్పంచ్ లక్ష్మణరావు, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఉమాపతి, గ్రామాల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్

నవతెలంగాణ-ఆర్మూర్



శిక్షకులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

మండలంలోని చేపూర్ గ్రామ శివారులోగల క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల వర్క్ షాప్ బుధవారం రూబికాన్ స్కిల్ డెవలప్ మెంట్ వారి ఆధ్వర్యం లో నిర్వహించారు. పూణే నుంచి వచ్చిన ం శిక్షకులు సునీల్, హరీష్, ఫయాజ్ విద్యార్థులకి గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ స్కిల్స్, డిబేట్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ శ్ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ ఇంటర్వ్యూ స్కిల్స్ మల్టీ నేషనల్ కంపెనీస లో ఉద్యోగాలు పొందటానికి ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. కళాశాలప్రిన్సిపల్ ప్రొఫెసర్ డా. రామ్ కింకర్ పాండే మాట్లాడుతూ... కమ్యూనికేషన్ సిల్క్ వాటికి ఉన్న ప్రత్యేకత గురించి తెలిపారు. వర్క్‌షాప్ నిర్వహించిన శిక్షకులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ కింకర్ పాండే, యాజమాన్యం, అధ్యాపకులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

చేపూర్‌లో శివాజీ విగ్రహ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పలుగుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ పాల్గొన్నారు. విగ్రహ దాత నియోజకవర్గ బీజేపీ నాయకులు ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి యువత క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయి కి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి కొంతం మురళి, గ్రామ శివాజీ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడెన్ పావెల్ సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-సిరికొండ

స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థాపకుడు, రాబర్ట్ స్మిత్ బడెన్ పావెల్, సోమ్స్ దంపతులు సమాజ హితం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య అన్నారు. ది భారత్ స్కౌట్, గైడ్స్ పితామహుడు బడెన్ పావెల్ 164వ జయంతి, ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని సత్యశోధక్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ముందుగా పావెల్, సోమ్స్ దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... సమాజ హితమే తమ అబిమతంగా భావించి, సామాజిక చైతన్యం, సమాజ శ్రేయస్సు కోసం సైనిక వృత్తిని వదులుకొని, జీవితాంతం దేశాభివృద్ధికి కృషి చేసిన మహనీయులని అన్నారు. స్కౌట్, గైడ్స్ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, సేవాభావం, ఉత్తమ వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. బడెన్ పావెల్‌ను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన ఆశయాల సాధనకు, సామాజిక చైతన్యానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ విద్యార్థులతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ వనిత, స్కౌట్స్ మాస్టర్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పోచారం, జమలం గ్రామాల్లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఎడపల్లి

పోచారం, జమ్లం, ఎడపల్లి, అంబం గ్రామాల్లో సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నాయకులు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుమ్మల గంగాధర్, సీపీఐఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ నాయకులు గుమ్ముల గంగాధర్, కె.రవి, శ్రీపతి మల్లేష్, కొండ లక్ష్మణ్, గంగన్న, వైద్యనాథ్, సుదర్శన్, హనుమాన్లు, శంకర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ, హక్కులపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు బాలల పరిరక్షణ విభాగం అధికారులు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బాల కార్మికులు లేకుండా చూడడం, అక్రమ రవాణా జరగకుండా చూడడం, చట్ట భద్రత లేని దత్తత లేకుండా చూడడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల హక్కులకు భంగం కలిగినట్టు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 1098కు సమాచారం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం అధికారులు జమ్రుత్, నాగేల్లి బాబు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ జోష్నా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌల్ట్రీ పరిశ్రమను వ్యవసాయానికి అనుసంధానంగా మార్చాలి



మాట్లాడుతున్న గరిడే వెంకటరావు

నవతెలంగాణ-తాడ్వాయి

పౌల్ట్రీ పరిశ్రమను వ్యవసాయానికి అనుసంధానంగా మార్చాలని ఓన్ ఫార్మర్స్ బ్రాయిలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గరిడే వెంకటరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కృష్ణాజివాడి రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఓన్‌ఫార్మర్స్ బ్రాయిలర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఉచిత కరెంటు ఇచ్చిన మాదిరిగానే పౌల్ట్రీ పరిశ్రమకు ఉచిత కరెంటు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన మక్కలలో 50శాతం పౌల్ట్రీ పరిశ్రమకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పైడి విట్టల్‌రెడ్డి, కార్యదర్శి చిరంజీవి, నాయకులు శేఖర్, అజీమ్, ప్రసాదరావు, సంతోష్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి కాంగ్రెస్ కార్యాలయంలో మదన్‌మోహన్ సమక్షంలో అమర్లబండ ఉప సర్పంచ్ మహేష్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్ అమర్లబండ మాజీ గ్రామ అధ్యక్షులు బాలశేఖర్, బీఆర్ఎస్ ధర్మారావుపేట గ్రామ యూత్ అధ్యక్షులు నవీన్ రావు, సంతోష్ రెడ్డి తదితరులు బీఆర్ఎస్ రాజీనామా చేసి మదన్‌మోహన్ సేవలకు ఆకర్షితులై బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సదశివానగర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు లింగాగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ ఇర్షాద్, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

కంటి చూపును అందించడమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

కంటి చూపును కోల్పోయిన వారికి చూపును అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎడపల్లి, నెహ్రూనగర్ గ్రామాలలో కంటి శిబిరానికి స్థానిక గ్రామస్తులు చేరుకొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎడపల్లి ఆస్పత్రి సూపర్‌వైజర్ రాజేశ్వర్, ఏఎన్ఎంలు, సరిత, ఆశావర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఏనుగు రాజమణి, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలను పరిశీలించిన విస్తీర్ణ అధికారి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పర్మల్ల గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్ కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో వరి పంటలను సందర్శించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న తెగుళ్లపైన రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, అగ్గి తెగులు, మొగిపురుగును గమనించి రైతులకు వీటి నివారణ చర్యలను సూచించారు. ఆయన వెంట రైతులు ఈర్ల ఎల్లయ్య, ఈర్ల గోపాల్, జగతి సాయిలు తదితరులున్నారు.

కంటి వెలుగు సిబ్బందికి ఘనంగా సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

కంటి వెలుగు సిబ్బందికి గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు బుధవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జనవరి 24వ తేదీ నుంచి కంటి వెలుగు కార్యక్రమం 24 రోజులపాటు నిర్వహించారు. 24 రోజులపాటు మెరుగైన సేవలందించిన లింగంపేట మండలం వైద్య అధికారి హిమ బిందు, విజయ, ప్రవీణ్, ఏఎన్ఎంలు రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, ఆశావర్కర్లకు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వారు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు లావణ్య, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రతిఒద్దీన్, వార్డ్ సభ్యులు ప్రసాద్, రమేష్, నరేష్, రాజు, సాయిలు, సర్పంచ్ పుట్టి పోచయ్య, యువ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు సమీక్షా సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కొత్త సంఘాల ఏర్పాటు, వృద్యాప్య సంఘాల ఏర్పాటు, తేనెటీగల పెంపకం, సోలార్ విద్యుత్ ఏర్పాటు, చేపల పెంపకంపై గత సమావేశంలో చర్చించిన విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, ఏపీడీ మురళి, డీపీఎం సుధాకర్, సీసీలు అబ్బు లింగం, గొర్రె రాములు, అంజయ్య, నరేందర్‌రెడ్డి, కృష్ణాంజలి, రమేష్, లత, వీఓలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలి

- కేంద్ర బొగ్గు గనుల డైరెక్టర్ మురళీధర్ గౌడ్

నవతెలంగాణ-తాడ్వాయి

పీకల లోతు అవినీతిలో కూరుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలని కేంద్ర బొగ్గుగనుల డైరెక్టర్ ఉప్పునూతల మురళీధర్ గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని సంగోజువాడి గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాగోస.. బీజేపీ భరోసా అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, నియంత పాలనను అంతమొందించాలని సూచించారు. ప్రజలు ఉత్తేజమై వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభుత్వానికి గట్టి షాక్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, ఉపాధ్యక్షులు రవీంద్రరావు, మండల అధ్యక్షులు వెంకట్రావు, నాయకులు హెూటల్ శ్రీను, లింగారావు, నర్సారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో నీరోల పాలన

- బీఎస్పీ మొదటి సంతకం బీసీ రిజర్వేషన్ల కోసమే
- లెండి ప్రాజెక్టు మాట వట్టిదేనా?
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణలో నీరోల పాలన కొనసాగుతుందని, ప్రజలు ఎవరు ఎక్కడ పోయినా అధికారం, ఆస్తి, ఫాంహౌస్ భద్రంగా ఉంటే చాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారని డా.ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ప్రజల సమస్యల గురించి ఎవరు మాట్లాడినా అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని తెలిపారు. బహుజన రాజ్యాధికార యాత్ర 187వ రోజు జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ ఇసుక రవాణా, డబుల్ బెడ్‌రూం ఇండ్ల గురించి మాట్లాడితే.. స్థానిక ఎమ్మెల్యే అక్రమ కేసులు పెట్టి పీడీ యాక్టు నమోదు చేస్తున్నారని ఆయన అన్నారు. రైతుల రుణమాఫీ చేయకుండా, రైతులు చనిపోతున్నా పట్టించుకోవడం లేదని, పైగా కిసాన్ సర్కార్ పేరుతో మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలు, స్థానిక దవాఖానాల్లో మూత్రశాలలు లేవన్నారు. మన ఊరు మన బడి కింద వేల కోట్లు ఎవరు తిన్నారో విద్యాశాఖ మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో కుక్కల దాడికి బాలుడు చనిపోతే నిర్లక్ష్యంగా, బాధ్యతారహిత సమాధానం ఇస్తున్నారని, కుక్కలకు ఆకలైతుందని చెప్పడం దారుణమన్నారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే మొట్టమొదటి సంతకం బీసీ రిజర్వేషన్లు పెంపు కోసం చేస్తామన్నారు. ఇతర బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. గత రెండు నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీ అని గుర్తు చేశారు. ఖదీర్‌ఖాన్ మృతికి కారకులైన వారిపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దేశాన్ని లూటీ చేస్తున్న అదానీ, రాష్ట్రాన్ని దోచుకుంటున్న కవితపై చర్యలేవి అని ప్రశ్నించారు. జుక్కల్ నియోజకవర్గంలో లెండి ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. స్థానిక జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని నెరవేర్చలేదన్నారు. మద్నూర్ మండలంలో వందకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా స్థానిక ఎమ్మెల్యే ఏనాడూ పట్టించుకోరని విమర్శించారు. స్థానిక ఎంపీ బీబీ పాటిల్ సొంత గ్రామానికి రోడ్డు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎంపీ అనుచరులు దేవాలయ, దళితులకు చెందిన భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. అందుకు ఇలాంటి దోపిడీ ప్రభుత్వాన్ని గద్దె దించి పేదలను పాలకులుగా చేయడానికే బీఎస్పీ వచ్చిందన్నారు. అందరూ ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. యాత్ర పెద్దఎక్లారా, ధన్నూర్, అంతాపూర్, కొడిచర, సుల్తాన్ పేట, డోంగ్లి, సిర్పూర్ గ్రామాల్లో కొనసాగింది. యాత్రలో జిల్లా అధ్యక్షులు బాలరాజు, జిల్లా ఇంచార్జిలు గంగారం, సాయిలు, సురేష్ గౌడ్, మహిళా కన్వీనర్ వసంత, నియోజకవర్గ నాయకులు తుకారం, రాందాస్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పేరుతో దోపిడీ..

నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిస్తే.. కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో దోపిడీలకు పాల్పడుతుందని డా.ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. బీఎస్పీ పార్టీ అధికారంలోకి వస్తే పది లక్షల ఉద్యోగాల కోసం ప్రణాళికలు రూపొందిస్తామని, బీసీ రిజర్వేషన్ 50 శాతానికి పెంచుతామని, అసైన్మెంట్ భూములు, పోడు భూముల రైతులకు పట్టాలిస్తామని, కౌలు రైతులకు ప్రత్యేకంగా ప్రణాళిక తయారుచేసి వారిని ఆదుకుంటామని చెప్పారు. ముఖ్యంగా విద్యా వైద్యరంగం ప్రత్యేకంగా రూపొందించి రాష్ట్ర ప్రజలకు ఈ రెండు రంగాలను ఉచితంగా అందజేస్తామని ఆయన తెలిపారు. జుక్కల్ ప్రాంతం పూర్తిగా వెనుకబడినతనానికి ఇక్కడి పాలకులే నిదర్శమని పేర్కొన్నారు. కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ సంక్షేమ పథకాలతో దోపిడీలకు పాల్పడుతున్నాడని తెలిపారు. సమావేశంలో బహుజన్ సమాజ్ జిల్లా నాయకులు, జుక్కల్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

జనం గోస వదిలేసారు..

జుక్కల్ : జనం గోస వదిలేసి భూస్వాములకు వత్తాసు పలుకుతున్నారని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ, ఖండేభల్లూర్, బస్వాపూర్, పెద్దఎడ్గి, పెద్దగుల్లా, బిజ్జల్‌వాడీ, హంగర్గ గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు తుకారాం, జుక్కల్ మండలాధ్యక్షుడు విలాస్, సీనియర్ నాయకులు గంగారాం, మద్నూర్ మిలన్‌భాయి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే శనగ విక్రయించాలి

- పలు చోట్ల శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



పిట్లం : కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్



గాంధారిలో..

నవతెలంగాణ-పిట్లం/గాంధారి

శనగ పంటను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి లబ్ధిపొందాలని చిల్లర్గి సింగిల్ విండో చైర్మన్ శపథం రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన శనగ పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం క్వింటాకు రూ.5335 ధర ప్రకటించిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, విండో వైస్ చైర్మన్ పుట్టి రాములు, నాయకులు రమేష్, గంగారం, మీద్దింటి సాయిలు, మండల వ్యవసాయ అధికారి కిషన్, సంఘం సీఈవో సంతోష్‌రెడ్డి, ఏఈఓలు సిబ్బంది పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం..

గాంధారి : మండల కేంద్రంలోని గాంధారి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శనగ కొనుగొలు కేంద్రాన్ని గాంధారి పీఏసీఎస్ చైర్మన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎన్‌డీసీసీబీ, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయికుమార్, జడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధాబలరాంలతో కలిసి శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గాంధారి సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు, గాంధారి సర్పంచ్ మామ్మాయి సంజీవ్ యాదవ్, ఎంపీటీసీలు తూర్పు రాజులు, పత్తి శ్రీనివాస్, సొసైటీ వైస్ చైర్మన్ ఉదల్ సింగ్, సొసైటీ డైరెక్టర్లు ధోల్లు సాయిలు, గాండ్ల లక్ష్మణ్, తాడ్వాయి సంతోష్‌కుమార్, రొడ్డ అశోక్‌రెడ్డి, ఆర్ల శివాజీరావు, వజీర్, సవితాభాయి, కోనింటి మణెవ్వ, గొల్ల హర్షయ్య, సొసైటీ సీఈవో మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని హైదరాబాద్ ఆస్పత్రిలో చేర్పించిన ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని కాయితి తాండాకు చెందిన యువకుడు బామన్ సురేష్ తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెంటనే స్పందించి సురేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తీసుకురావలసిందిగా తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి అక్కడి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఆసుపత్రి చికిత్స ఖర్చులను గురించి భయపడొద్దని అన్ని విధాలా తన సహాయ సహకారాలు అందిస్తానని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సురేందర్ ధైర్యం చెప్పారు.

విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలి



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న లింబాద్రి

నవతెలంగాణ-భిక్కనూర్

పదవ తరగతి విద్యార్థులు వచ్చే వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించి తాము చదువుకుంటున్న పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింబాద్రి సూచించారు. బుధవారం పదవ తరగతి విద్యార్థుల పరీక్షల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసిన పుస్తకాలను, స్టడీ మెటీరియల్‌ను పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న స్టడీ మెటీరియల్ విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృంద సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్దాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని చిందు ఎల్లమ్మ కాలనీలో సర్పంచ్ సిర్ప మంజుల సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఉపాధిహామీ నుంచి మంజూరైన రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్టు ఆమె తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరిచేసి సహకరించిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్ధవర్ గంగారెడ్డి, సాలురా బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గోగినేని నరేంద్ర బాబు, కార్యదర్శి సుదర్శన్, మండల యువజన ప్రధాన కార్యదర్శి మజర్ అలీ, ఏరాజ్‌పల్లి ఎంపీటీసీ వెంకటేష్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పశువైద్యాధికారి భరత్‌కుమార్



లింగంపేట్ : టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

నవతెలంగాణ-లింగంపేట్/తాడ్వాయి/జుక్కల్

గొర్రెల మేకల పెంపకం దారులు నట్టల నివారణ మందులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి భరత్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెలకు మేకలకు వ్యాధులు సంభవించకుండా ముందస్తుగా జిల్లావ్యాప్తంగా నట్టల నివారణ మందును గ్రామాల వారీగా వేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తుందన్నారు. ఇందులో భాగంగానే మండల కేంద్రంలో 3685 గొర్రెలకు, 284 మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నిసా నయీం, వైస్ ఎంపీపీ విట్టల్‌రెడ్డి, సర్పంచ్ బొల్లు లావణ్య, ఉపసర్పంచ్ రవి, పశువైద్యాధికారి రవికుమార్, గోపాల మిత్ర సభ్యులు రమేష్, మల్లయ్య ఎజాజ్, కృష్ణ, వెంకటి, శివలాల్, భైరయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండలంలోని చిట్యాల గ్రామంలో బుధవారం గ్రామంలోని గొర్రెలకు మేకలకు ఉచిత నట్టల నివారణ మాత్రలను పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కవితా బాలయ్య హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రామ్ చందర్, ఎంపీటీసీ రవి, రాజమణి, గొర్రెల మేకల పెంపకందారులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండల కేంద్రంలో ఉచిత నట్టల నివారణ శిబిరాన్ని మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు అధ్వర్యంలో మండల ప్రజాప్రతినిధులు ఉచిత నట్టల నివారణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెటర్నరీ వైద్యుడు పండరినాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు, ఏఎంసీ చైర్మెన్ సాయాగౌడ్, నాయకులు దాదారావ్ పటేల్, నీలుపటేల్, ఎమ్మార్వో, ఎంపీడీవో, గోపాల మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను మెరుగుపరచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

నవతెలంగాణ-ఎడపల్లి

మన ఊరు మనబడి కార్యక్రమాలలో ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్య కమిటీతో పాటు ఉపాధ్యాయులపై స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందని నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మన ఊరు మన బడి పథకం కింద పాఠశాల ఎంపిక ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మాలపెద్దులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్ఆర్ఈజీఎస్ మన ఊరు మనబడి కార్యక్రమంలో మంజూరైన టాయిలెట్లు, కిచెన్‌రూమ్ నిర్మాణం పనులు ప్రారంభం కాకపోవడానికి కారణాలను సమీక్షించారు. పాఠశాలలో అవసరమైన కొన్ని రిపేరింగ్ పనులను చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంఈఓ రామారావు, ఎంపీటీసీ జావిద్ బాబా, ఎస్ఎంసీ చైర్మన్ మాల పెద్దులు, కంటెడి గంగాధర్, ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

- గురుకుల సొసైటీ కార్యదర్శి రమణ కుమార్



కూరగాయలు సాగును పరిశీలిస్తున్న గురుకుల సొసైటీ కార్యదర్శి

నవతెలంగాణ-ఎడపల్లి

పదవ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో బాలికలు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కష్టపడి ఇష్టంతో చదివి పాఠశాలకు, కళాశాలకు ఎడపల్లి మండలానికి మంచి పేరు తీసుకురావాలని గురుకుల సొసైటీ కార్యదర్శి రమణ కుమార్ అభిప్రాయపడ్డారు.

మంగళవారం సాయంత్రం సుమారు 8 గంటల ప్రాంతంలో ఆయన ఎడపల్లి మండల పరిధిలోగల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలను సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న, జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను తరగతి గదులను, వంటగదిని ఆయన పరిశీలించారు. అంతకు ముందుగా ఆయన వంటశాల గదిని పరిశీలించి గది నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ప్రిన్సిపల్ సుహాసి నిరెడ్డికి సూచించారు. పాఠశాల ఆవరణలో కిషన్ షెడ్డును ఆయన పరిశీలించారు. సాగుచేస్తున్న కూరగాయలను పరిశీలించారు. ఆయన వెంట టీఆర్ఈఐఎస్ డిప్యూటీ ఇంజనీర్ యూసుఫ్, కార్యదర్శి ప్రసాద్, ప్రిన్సిపాల్ సుహాసినీరెడ్డి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, మాధురి, రజిని, నవీన్, బాబు కిరణ్, గౌతమి, శంకర్‌గౌడ్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

దళితున్ని ముఖ్యమంత్రి చేయలేదు

• మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ దళితున్ని ముఖ్యమంత్రి చేయలేదని ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం మండలంలోని అయ్యపల్లి, శెట్పల్లి, పర్మల్ల గ్రామాలలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దత్తు రాములు, జిల్లా స్థాయి నాయకులు బొల్లారం సాయిలు, చేపూరి పోశెట్టి, మండలస్థాయి నాయకులు ఎల్లమయ్య, గంగారెడ్డి, లక్ష్మారెడ్డి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

నవతెలంగాణ-రెంజల్



మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ను కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ రామచందర్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. బోధన్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించి నట్టుగానే తమకు కూడా ఇండ్ల స్థలాలను ప్రభుత్వం స్థలంలో చూపించాలని వారు కోరారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని వారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల పాత్రికేయులు గంగాధర్, జె.సంతోష్, ఎస్.గంగాధర్, మమ్మాయి నాగరాజ్, కిరణ్, బి.శ్రీనివాస్, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో

సిద్దుల గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ దుర్మరణం

• పట్టణంలో విషాద ఛాయలు

నవతెలంగాణ-ఆర్మూర్



చంద్రశేఖర్‌రెడ్డి(ఫైల్)



పాడెమోస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

పట్టణంలోని నవనాథ సిద్దులగుట్ట ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు చంద్ర శేఖర్ రెడ్డి (50) విద్యుత్ ఘాతంతో బుధవారం మృతిచెందాడు. ఆయన తన వ్యవసాయ పంట పొలంలో నీరు పెట్టేందుకు వెళ్లడంతో అక్కడే విద్యుత్ షాకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు అందరితో కలుపు గోలుగా ఉండే శేఖర్‌రెడ్డి మృతితో పట్టణంలోని ఆయన స్వగృహం ఆలూరు రోడ్డు ప్రాంతం జన సంద్రంగా మారింది. శేఖర్ రెడ్డికి భార్య, కూతురు ఉన్నారు.

పాడే మోసిన ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి

ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డికి అత్యంత సన్నిహితులు, పట్టణ నవనాథ సిద్దులగుట్ట ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు శేఖర్ రెడ్డి మరణించారన్న సమాచారం తెలిసి జీవన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. హైదరాబాద్ నుంచి హుటాహుటిన పట్టణానికి చేరుకున్న జీవన్ రెడ్డి, రజితారెడ్డి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శేఖర్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. జీవన్ రెడ్డి శోకతప్త హృదయంతో తన సన్నిహితుడు శేఖర్ రెడ్డి పాడె మోసి కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి, ఆయన సతీమణి రజితారెడ్డి శేఖర్ రెడ్డి కుటుంబాన్ని ఓదార్చారు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. శేఖర్ రెడ్డి మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు తనకు తీరని లోటు అని కంటనీరు పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వర్ రెడ్డి , నాయకులు పండిత్ పవన్, ప్రేమ్, పట్టణ మండల అధ్యక్షులు పూజా నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, గోవింద్‌పేట్, ఆలూరు, పిప్రీ సొసైటీల చైర్మన్లు బంటు మహిపాల్, కళ్లెం బోజారెడ్డి, సోమ హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్

• సినీనటిని చూసేందుకు వచ్చిన ప్రజలతో రద్దీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్

నిజామాబాద్ నగరంలోని ముగ్ధ వస్త్ర షోరూమ్ ప్రారంభోత్సవానికి సోలో బతుకే సో బెటర్ గురు, ప్రముఖ సినిమాలలో నటించిన సినీ నటి నభా నటేష్ హాజరైంది. సినిమా హీరోయిన్‌ను చూడడానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. ఎప్పుడు రద్దీగా ఉండే రైల్వే స్టేషన్ ప్రాంతంలో హీరోయిన్ రాకతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అసలే ఇరుకైన రోడ్డులో ఇంత పెద్ద షోరూం ఏర్పాటు చేయడంతో వాహనదారులు రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అటువైపు నుంచి వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తున్న అంబులెన్స్ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. అంబులెన్స్‌లో ఉన్న రోగి ప్రాణాలు పోతే ఎవరు బాధ్యులు? అసలు ఇంత ఇరుకైన రోడ్డులో ఇంత పెద్ద వస్త్రషోరూంకు అనుమతులు ఎలా ఇచ్చారు. ఏదైనా ప్రమాదం జరిగితే అగ్ని మాపక శాఖ శకటం కూడా రాలేని పరిస్థితి. ఈ షోరూంకు మున్సిపల్ శాఖ నుంచి, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు ఇచ్చారా..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

దుకాణాల సముదాయాన్ని ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్మించిన దుకాణల సముదాయాన్ని ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కార్యాలయానికి ఆదాయం సమకూర్చేందుకు దుకాణాల సముదాయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, పిప్పెర అనిల్, నోముల రజిత, తోట జ్యోతి, దుబ్బాక సుప్రియ, ఏశాల నరసయ్య, బుసపురం సుప్రియ, లకావత్ గంగాధర్, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, తహసిల్దార్ సురేష్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంట్ మైలారం గంగాధర్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావటం లేదని

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గడ్డం నవీన్‌కుమార్ (25) అనే యువకుడు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేండ్ల క్రితం ఎల్లారెడ్డి మండలం మీసాన్‌పల్లి గ్రామానికి చెందిన మంజులతో వివాహం జరిగింది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు చోటుచేసుకోవడంతో మంజుల పుట్టింటికి వెళ్ళిపోయింది. పలుమార్లు పెద్దల సమక్షంలో మాట్లాడినప్పటికీ భార్య కాపురానికి రాలేదు. తీవ్ర మనస్థాపానికి గురై భర్త గడ్డం నవీన్‌కుమార్ బుధవారం రాత్రి రామాలయం సమీపం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఉదయం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గడ్డం నవీన్ అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి ఒక పాప ఉంది. మృతదేహాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన పంచాయతీ

నవతెలంగాణ-పిట్లం

అనాథ శవానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికుల కథనం మేరకు మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన కిష్టవ్వ (68) వృద్ధ మహిళ అనారోగ్యం కారణంగా బుధవారం ఉదయం మృతిచెందడంతో బంధువులు రాకపోవడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ విజయ శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు జేసీబీ, ట్రాక్టర్ సాయంతో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు సాయిలు, శోభ పోచయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా గౌలపల్లి మల్లేష్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా వెంకటాపూర్ గ్రామానికి చెందిన గౌలపల్లి మల్లేష్‌ను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు బీజేపీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా మంగలి బాలకిషన్

నవతెలంగాణ-లింగంపేట్

నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా లింగంపేట గ్రామానికి చెందిన మంగలి బాలకిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందు నాయిని తెలిపారు. నియామకపత్రాన్ని ఆయన చేతుల మీదుగా అందజేశారు. నాయి బ్రాహ్మణ సంఘం చేపట్టిన పలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ ఆయనకు బాధ్యతలు అప్పగించినట్టు వివరించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారమే లక్ష్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారమే లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. యూత్ కాంగ్రెస్ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జి సురబీ ద్వివేది, అర్చిత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గజనంద్ పటేల్, ఉపాధ్యక్షుడు భారత్‌రెడ్డి, ఎల్లారెడ్డి యూత్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పెట్రోల్‌పై స్థానికుల ఆగ్రహం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట్ మండలంలోని శ్రీ మణికంఠ పెట్రోల్ పంపులో బుధవారం కల్తీ పెట్రోల్ కలకలం రేపింది. చినూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పెట్రోల్ కోసం బాటిల్ తీసుకొని వెళ్లడంతో బాటిల్‌లో పోసిన పెట్రోల్‌లో వాటర్ కనిపించాయి. దీంతో సదరు వ్యక్తి బంక్ నిర్వహకులతో వాగ్వాదం చోటుచేసుకుంది. కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రామారెడ్డికి ఈటల రాజేందర్ రాక

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రానికి హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ సీనియర్ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి గురువారం రానున్నట్టు బీజేపీ నాయకులు నారెడ్డి రాజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ కార్నర్ సమావేశానికి హాజరుకానున్నందున, బీజేపీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పేర్కొన్నారు.

స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బీజేపీ బలోపేతానికి బూత్ లెవెల్‌లో ప్రతి ఒక్కరూ పని చేయాలని బీజేపీ నేత, ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్‌లో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ బూత్ నాయకులు, శక్తి కేంద్రాల ఇన్చార్జీలు, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని సజ్జనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు బుధవారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. విహారయాత్రలో భాగంగా యాదాద్రి, వర్గల్, నాచారం, కొండ పోచమ్మ, కొమురువెల్లి, సిద్దిపేట్, కోమటిచెరువు వంటి ప్రాంతాలకు తీసుకెళ్లారు. విద్యార్థులు అక్కడ గుడులను, చెరువులను, ప్రాంతాలను పరిశీలించి పలు విషయాలను అవగాహన చేసుకున్నారు. యాదాద్రి కట్టడాలు, శిల్పకళా సంపద అబ్బురపరిచే విధంగా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బన్సీ, పద్మ, కవిత, సంగమేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దాం

• అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఆర్మూర్

ప్రజాపంథా మార్గంలో ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దామని, అప్పుడే నూతన జనతా ప్రజాతంత్ర విప్లవం సాధ్యమవుతుందని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ అన్నారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవం వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా పార్టీ జెండా సబ్ డివిజన్ కార్యదర్శి సురేష్ ఆవిష్కరణ చేశారు. సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకులు డాక్టర్ సత్యనారాయణ , అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కిషన్, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు సత్యక్క, అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి అశోక్, ప్రగశీల రైతు సంఘం జిల్లా నాయకులు బాలయ్య, ఎం సాయా రెడ్డి, ఆనంద్, ఖదీర్, ప్రజాపంథా నాయకులు పెద్ద రాజేశ్వర్, లక్ష్మక్క, రాధక్క పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ ప్రజాపంథా జెండా ఆవిష్కరణ..

ఆర్మూర్ : సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజపంథా కార్యాలయం కుమార్ నారాయణ్ భవన్‌లో బుధవారం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంపంథా జిల్లా నాయకులు వి.ప్రభాకర్, బి.దేవారం, ఎం.ముతన్నలు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు విప్లహోద్యమం ఆరంభమై 103 ఏండ్లు అయిందని, శతాబ్ది ఉత్సవాలను నిర్వహించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాపంతా సబ్ డివిజన్ నాయకులు కిషన్, శేఖర్ గంగన్న, రాజన్న, ఎం నరేందర్ ఇస్తారు రమేష్ ఠాకూర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు రోహిత్ ,గంగాధర్, మనోజ్ ,అరవింద్ రాజేందర్ విద్యార్థి సంఘం ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ అనిల్ నవీన్ యువజన సంఘం నాయకులు వెంకటేష్ ,శేఖర్, రాజా రామ్, శ్రీనివాస్ ,నజీర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు విజయవంతానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కంటి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని ఎంపీపీ అధ్యక్షరాలు లోలపు గౌతమి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఎంపీపీ గౌతమి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు శాఖలపై సమీక్షించి, తీర్మానాలు చేశారు. సభ్యుల ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, తహసిల్దార్ సురేష్, కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుణవీర్ రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌లకు ఘన సన్మానం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/దోమకొండ





ఆర్మీకి ఎంపికైన యువకులను సన్మానిస్తున్న పలువురు

మండలంలోని పెద్ద దేవిసింగ్ తండా, వడ్లం గ్రామానికి చెందిన నలుగురు యువకులు అగ్నిపథ్‌లో భాగంగా ఆర్మీకి ఎంపికైనందుకు వడ్లం పాఠశాలలో బుధవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపికైన బామాన్ సజాన్ లాల్, భావుసింగ్, ప్రవీణ్, నాగరాజు అనే యువకులు ఇటీవల అగ్నిపథ్ వీరులుగా ఎంపిక కావడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తుల సహకారంతో వీరికి పాఠశాల ఆవరణలో పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు శ్యామప్పపటేల్, మలుగొండ విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపికైన యువకునికి సన్మానం

దోమకొండ : మండల కేంద్రానికి చెందిన సాహెబ్‌గారి నవీన్ ఆర్మీ అగ్నిపథ్‌లో ఎంపికైనందున ఘనంగా సన్మానించారు. సర్పంచ్ అంజలి శ్రీనివాస్ మాట్లాడారు. డీఎలోపీఓ సాయిబాబా మాట్లాడుతూ.. దేశ సేవ కోసం యువకులు ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సాహెబ్‌గారి రాజు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుందలో 24న భరతమాత విగ్రహ ఏర్పాటు

నవతెలంగాణ-బిచ్కుంద



విగ్రహం వద్ద పద్మశాలి సంఘం సభ్యులు

మండల కేంద్రంలోని మార్కండేయ మందిర ఆవరణలో ఉన్న పురాతన భరతమాత ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టి మూడున్నర క్వింటాళ్ల పంచలోహ భరతమాత విగ్రహాన్ని తయారు చేయించి ఈ నెల 24న ఏర్పాటు చేయనున్నట్టు పద్మశాలి సంఘం సభ్యులు తెలిపారు. భారత దేశ స్వాతంత్రం కోసం ఉద్యమంలో ఈ ప్రాంత ప్రజలు పాల్గొని దేశభక్తి చాటుకున్నారని భారతదేశం స్వాతంత్రం పొందిన తర్వాత స్వాతంత్ర సమరయోధులు ఆ సమయంలో ఎక్కడాలేని విధంగా బిచ్కుంద మండల కేంద్రంలో భరతమాత మందిరం నిర్మాణం చేపట్టి భరతమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ప్రతి సంవత్సరం ఆనవాయితీగా ఉత్సవాలు నిర్వహిస్తూ పండుగలు జరుపుకుంటున్నామని తెలిపారు. భరతమాత మందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం చేపట్టి మూడున్నర క్వింటాళ్ల పంచలోహ భరతమాత విగ్రహాన్ని తయారు చేయించినట్టు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో గణపతి హెూమం, అన్నదానం, దేశభక్తి పెంపొందే విధంగా సంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ గురువారం భరతమాత విగ్రహాల ఊరేగింపు కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను చేత భూని భారీ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని, శుక్రవారం భరతమాత విగ్రహ ఏర్పాటు కార్యక్రమం, అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పద్మశాలి సంఘం సభ్యులు తెలిపారు. ఎక్కడా లేని విధంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భరతమాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రకళరాజు, పద్మశాలి సంఘం అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు హనుమాన్లు, బాన్సువాడ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ రాజు, డాక్టర్ నర్సింలు, ఖథ్గాం హన్మండ్లు, రచ్చశివకాంత్, బాలకిషన్, బోడ అంజయ్య, షేర్ల బాలరాజ్, పరమేష్, మాలేగాం శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రయినేజీలు శుభ్రం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో మురికి కాలువలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం శుభ్రం చేశారు. దీంతో పాలకవర్గానికి కాలనీవాసులు అభినందనలు తెలిపారు.

అటవీ సంరక్షణ నియమాలు 2022ను వెంటనే ఉపసంహరించాలి

• ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అటవీ సంరక్షణ నియమాలు 2022 ను వెంటనే ఉపసంహరించాలని, పోడు సాగు భూములకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. బుధవారం డిచ్ పల్లి మండలం లోని కొరట్‌పల్లి గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య కార్యకర్తలు సమావేశానికి హాజరై మాట్లాడారు. 50 ఏళ్లుగా ఆదివాసి, గిరిజన, దళిత పేద ప్రజలు సాగు చేసుకుంటున్న భూముల నుండి బేదాఖలు చేయించే కుట్రను మోడీ ప్రభుత్వం చేస్తుందని అన్నారు . వ్యవసాయ రంగాన్ని పోడు భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే యత్నం మోడీ సర్కార్ చేస్తుందని ఆయన ఆరోపించారు. జిల్లాలో వేలాది ఎకరాలు పార్ట్" బి "లో ఉన్న రైతులకు కొత్త పాసు బుక్కులు ఇవ్వాలని, రైతుబంధును అందజేయాలని ధరణి పోర్టల్ లో అనేక అవకతవకలు ఉన్నందున దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నియమావలిని రద్దు చేయాలనీ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు బుచ్చన్న, ఎఐకెఎమ్ఎస్ అర్మూర్ డివిజన్ కార్యదర్శి బాబురావు, ముతన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా మార్గంలోనే సమసమాజానికై ఉద్యమించాలి

నవతెలంగాణ-బోధన్/రెంజల్

సమసమాజ స్థాపనకు ప్రజాపంథా మార్గంలో ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా బోధన్ సబ్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. బుధవారం పార్టీ ఆవిర్భావం సందర్భంగా బోధన్ పట్టణంలోని పోస్టాఫీసు వద్ద, నర్సాపూర్, సాలూర మండలం ఖాజాపూర్, తగ్గెల్లి పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపంథా మార్గంలోనే అసమానతలు లేని సమసమాజ నిర్మాణానికై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. నేడు దేశంలో సామ్రాజ్యవాద అనుకూలత, పెట్టుబడిదారీ వర్గాల ఆధిపత్య సమాజమే కొనసాగుతున్నదని అన్నారు. దేశంలో కమ్యూనిస్టు విప్లవోద్యమంలో మితవాద అవకాశవాదం, అతివాద అరాచకాల విధానాల మూలంగా తీవ్రమైన నష్టం జరిగిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కూడా తగిన భౌతిక పరిస్థితులు లేనప్పటికీ ఆచరణకు విరుద్ధమైన నినాదాలను ఇస్తున్నందునే గత సంవత్సరం ఫిబ్రవరి 22న న్యూడెమోక్రసీ నుంచి వీడిపోయి ప్రజాపంథా పార్టీగా వేరు అయినట్టు తెలిపారు. ప్రజాపంథా వెలుగులో నిజమైన విప్లవోద్యమానికై కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, లాలయ్య, గంగాధర్, నాగయ్య, దేవేందర్, చింతం రాములు, లక్ష్మిబాయి, మారుతి, భీమ్‌రావు, బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలే చరిత్ర నిర్మాతలు..

రెంజల్ : పేద ప్రజలే చరిత్ర నిర్మాతలని, ప్రజానీకాన్ని విప్లవ ఉద్యమంలో మమేకం చేయడమే ప్రజా పంథా లక్ష్యమని సీపీఐఎంఎల్ ప్రజాపంథా సబ్ డివిజన్ నాయకులు డి.రాజేశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని తాడ్‌బిలోలి, బోర్గం, నీలా గ్రామాలలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ స్థాపనకు ప్రజలందరూ విప్లవ ఉద్యమంలో భాగస్వాములు కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో అశేష ప్రజానీకాన్ని విప్ల ఉద్యమంలో మమేకం చేసి ప్రజా సంఘాల నిర్మాణంతోపాటు, ప్రజా ఉద్యమం చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పార్వతీ రాజేశ్వర్, ఎస్కే నశీర్, వడ్డెన్న, పుట్టి నడిపి నాగన్న పెద్దలు, గోపాల్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.